# అవతార పురుషులు

కొండలరావు యీ ఆఫీసు చుట్టూ తిరగడం యిది పదోసారి. ఈవేళ యెలాగైనా యెంత ఆలస్యం అయినా పని జరిపించుకోనిది కదలనని భీష్మించుకున్నాడు. అసలే అర్భకుడు. ఆఫీసు వరండాలో కూర్చున్నా వేసవి యెండ దూసుకువచ్చి పొడుస్తోంది. చెమట కార్చుకుంటున్నా అధికారి కోసం కాసుక కూర్చున్నాడు. అతను అంత వేగిరం దయచేస్తారా? వేసుకున్న తెల్లని పలచని కళ్ళీ లాల్చీ అప్పుడే చెమటలో తడిసిపోయి, తన నల్లని శరీరాన్ని అంటుకుని మాసిపోయింది.

ఆఫీసు బయట తొగరుచెట్టు. మండుటెండని మ్రింగి, వేడెక్కి యెర్రని పూలతో కులుకుతోంది. కష్టసమయాల్లో ఆదుకునే ఆత్మీయుల్లా, ఆ కదులుతున్న రెమ్మలు కనిపించగానే లేచి గాలికి ఆశించి ఆ చెట్టు క్రింద కూర్చున్నాడు. అలా కూర్చొని ఆఫీసు వైపు చూస్తున్నాడు. రెండు నెలలై యీ ఆఫీసు గడప తొక్కగా పొందిన అనుభవాలు వొక్కొక్కటి గుర్తుకు వస్తున్నాయి. ఎదురుగా అధికారి దగ్గర బుల్లి అధికారిగా ప్రవర్తించే బంట్రోతు. మెడలో యేకపేట బంగారు గొలుసు. చేతిలో ఖరీదైన వాచీ. కొండలరావుతో అన్నాడు కదా యిదివరకు! "ఉత్తి అమాయకుడిలా కనిపిస్తున్నావ్. చీకట్లో తిరుగుతావెందుకు? ఆ స్విచ్చి యెక్కడుందో కనుక్కొని నొక్కు. దీపం వెలుగుతుంది. నీ పని అయిపోతుంది."।

పెత్తనం వహించిన వాడికి యే పెద్ద కబుర్లాడినా చెల్లుతుంది. తన జీవితంలో పెద్ద కబుర్లే కాదు, అసలు కబుర్లు చెప్పకుండా కుచేలుడిలా అణిగి మణిగి వుండబట్టికదా- వీడు కూడా తనను అమాయకుడు అనేశాడు. ఎదుటివాళ్ళ కష్టాలకు రామరామ అని తోచిన సహాయం చేసిన కొండలరావుకు యీనాడు సహాయం చేసిన వాడెవడూ కనపడలేదు. ఎలా చెప్పకుంటే అధికారి మనసు కరిగి, తన పని నెరవేరుస్తాడని ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో తనలానే యింకొకడు చెట్టు క్రిందకు చేరాడు. తనకన్నా అతని జుత్తు బాగా నెరసివుంది. పుష్టిగా కనిపిస్తున్నా యెందుకో పిరికి మనిషిలా జడుస్తున్నట్లు కనిపించాడు.

"మీరేం పనిమీద వచ్చారు?" కొండలరావు ప్రశ్నించాడు. అతను కళ్ళద్దాలు తీసి కన్నులు నులుపుకుంటున్నాడు.

"నలుసు పడిందా? కూర్చోండి. నా పేరు కొండలరావు."

అతను కూర్చుంటూ "నా పేరు సుదర్శనం" అన్నాడు. గొంతుకలో శోకపుజీరయింకా పోలేదు.

"మీరేం పనిమీద వచ్చారు? మీ పేరు సుదర్శనం కదా, సుదర్శన చక్రం సంధించలేకపోయారా?"

"వేసినా లొంగటం లేదండీ! ఏనాడో మనమూ ఛస్తాం అన్న భయం లేని మనుషుల మీద యే చక్రం ప్రయోగిస్తే యేం లాభం?"

"అయ్యా! రాతిపశువు నందిని పూజించి ప్రాణం వున్న పశువును బాదుతున్న మనషులండీవీళ్లు! ఈ రోజుల్లో పని జరిపించే సుదర్శన చక్రం ఒక్కటే - లంచం!"

"మీపనేమిటి? ఇప్పటికెంత ఖర్చుపెట్టారు?"

"ఒక్కడే కొడుకు, దేముడు అంతా సరిగ్గానే చూసాడు. ఆ పరమాత్ముని నిందించలేను. చదువు, ఉద్యోగం, పెళ్ళాం, పిల్లలు. కానీ, తోటి మనిషి నా కొడుకు బాగు చూడలేకపోయాడు. నౌఖరీనించి సైకిలుమీద వస్తుంటే,యమ స్పీడులో లారీ గుద్దేసింది. నేనా- ముసలోడ్ని. కోడలా- పది రూపాయలు సరిగ్గా లెఖ్ఖపెట్టలేనిది. ఎలాగ బతుకుతాది? దానికేదో ఆ ఆఫీసులోనే చిన్న ఉద్యోగం దొరకాలంటే. రావలసిన డబ్బు రాబట్టుకోవాలంటే 'డెత్ సర్టిఫికెట్' కావాల కదా! దానికోసం మూడు నెలలై తిరుగుతున్నాను. ఏదో గొడవ వుందట,రేపురా మాపురా అంటారు. తేల్చరు. ఈ వేళ అందరికీ అందుబాటైన మనిషి ఆ ఆఫీసరు బాబు, ఆ కలంతో అధికార ముద్ర వేసేవాడు. ఆ బాబుతో నా గోడు చెప్పకుందామని కాసున్నాను. ఇంతకీరాడు, అంతకీరాడు. తమరేల వచ్చారు?"

"ఇది మా వూరు నా చిన్నప్పుడు యీ వూర్లోనే మెసలాను. మా నాయనకు యిద్దరు ఆడపిల్లల తరవాత నేనొక్కడినే కొడుకును. ఆడపిల్లల పెళ్ళిళ్ళకు స్వంత యిల్లు భూమి అంతా అమ్మేసినాను. నేను రైల్వే స్టేషను మాష్టరు ఉద్యోగం చేసి రిటైరైపోయాను యీ మధ్యనే. మా నాయన గారికి ఒక కోరిక వుండిపోయింది- ఈ వూరిలో స్వంత యింటిలో చచ్చిపోదామని!"

"తెలియక అడుగుతాను. స్టేషను మాస్టరు ఉద్యోగం చేశామన్నారు. బాగా కస్సీ దొరుకుతుంది కదా! సర్వీసులో వుండగా యిల్లు యేల కట్టించారు గాదు?"

"ఇంత సార్వీసులో ఒక రూపాయి కాదుకదా, ఒక మిఠాయి పేకెట్ అయినా తీసుకోలేదు."

"ఇంటి ప్లానులు యిచ్చినారా? ఈ దెయ్యాలకి కుంభం పోస్తే గానీ మీ యింటిప్లాను మీద సంతకం కాదు! బాబూ - చచ్చినప్పుడు ఆ పిడికిలు పట్టిన చెయ్యి దానంతట విడిపోవాలిగాని- లంచం మరిగిన మనుషులు ఆ పట్టు వదలరు బాబూ"

"పాపంతో కట్టించిన యింటిలో అంత పుణ్యం చేసిన మా నాన్న చావడం నాకిష్టం లేదు."

ఎండ తీవ్రత హెచ్చుతోంది. ఉండీ మడిగీ దక్షిణ గాలి వీస్తోంది. సుదర్శనం చెట్టుక్రిందే చారబడ్డాడు కొండలరావు చెట్టు మొదలుకు చారబడి తలెత్తి ఆ యెర్రని పూలమలారం వేపు, యీ కొమ్మనించి ఆ కొమ్మ కెగిరే పిచ్చికల సమూహం వేపు అలా చూస్తూ చూస్తూ వుంటే మనసులో ఒక ప్రశ్న వుదయించింది. సమాధానం కోసం గింజుకుంటూ, ఆ చల్లని గాలికి చిన్న కునుకుపాటులో పడ్డాడు. ఏం కలగన్నాడో, యే గొంతుక విన్నాడో చప్పున వులిక్కిపడి లేచిపోయాడు. సుదర్శనం నిద్దరపోలేదు. అలా ఆఫీసు మెయిన్ గేట్ వేపు చూస్తూనే వున్నాడు.

"సుదర్శనం గారూ - మీది యీ వూరేనా?"

"పుట్టిననించి యీ వూరు కదల్లేదు, వదల్లేదు."

"ఇదిగో - మనం కూర్చున్నామే - యీ చెట్టు క్రింద. ఈ జాగాలో ఒకప్పుడు శ్మశానం గాని వుండేదా?"

"ఏం, అలాంటి సంశయం వచ్చింది?"

"చిన్నప్పుడే నేను యీ వూరు వదిలేశాను. మీరు యీ మేడలూ మిద్దెలూ లేవడం చూసే వుంటారని..."

"ఇక్కడ ఒక చెరువుండేది. అంత నీరున్న చెరువు చూస్తుండగానే యెండిపోయింది. పట్నం పెరుగుతూ యిటువేపు వస్తుంటే, యీ చెరువును

వూరి చెత్తతో నింపేశారు. దానిమీద యీ ఆఫీసు, యీ చెట్టూ చేమా, పార్కు అంతా లేచాయి."

అంతా విన్నాక కొండలరావు చుట్టూ కలయజూస్తున్నాడు. చిన్ననాటి స్మృతులు ఒక్కొక్కటే జ్ఞప్తికి వస్తున్నాయి.

"ఈ యెత్తయిన చెరువుగట్ల చుట్టూ మర్రి చెట్లు వుండేవికావూ?"

"హూఁ- ఉండేవి. నేనొకసారి ఒక చెట్టు యెక్కాను.కాకులు తరిమాయి. చూస్తే పైన కాకి పట్టు వున్నాది."

"నేనూ యెక్కాను. కానీ పైనుంచి పామును చూసి-దిగి-పరుగో!"

"పచ్చని తోటలో పాములుండటం సహజంకదా!ఆ పాముల్ని చంపగలం కానీ యీ పాములని యెవడు చంపగలడు?" విసుక్కుంటూ నెత్తి బాదుకుంటూ అన్నాడు సుదర్శనం.

ఎండ-ఎదిగిపోతున్నయెండ. ఈ అధికారి యెప్పుడు వస్తాడో? వచ్చినా యెంతసేపటికి దర్శన మిస్తాడో? రెండుదాటినా అతని జాడ లేదు. బంట్రోతు అసలు వస్తాడో రాడో ఖచ్చితంగా చెప్పలేడట. సుదర్శనం విసిగిపోయి, వేరే పనివుందని వెళ్ళిపోయాడు. ఈ వేళనే యిదేదో తేల్చుకుందామని భీష్మించుకుని కొండలరావు కూర్చున్నాడు.

ఆకలిని ఓదార్చి కూర్చున్నాడు. చివరకు వచ్చిన ఆఫీసరు మధ్యాహ్న భానుడిలా కారు దిగాడు. పేరుకు నరసింహం. అడుగు ముందుకు వేస్తుంటే సింహం జూలులా జుత్తు కదలుతోంది. వెంట యిద్దరు కదలగా ఆఫీసులో జొరబడ్డాడు. జనం మూగితే భూషణం అదరుతున్నాడు. కాళ్లు పీకెట్టిన వాళ్ల వరండాలో బెంచీమీద కూర్చుంటే వాళ్ళప్రక్కన కొండలరావూ కూర్చున్నాడు. ఆకలి వేస్తున్నా మనసు నడుపులో పెట్టుకున్నాడు. తనతో వచ్చిన వాళ్లుండగా సింహ గర్జన వినపడలేదు. వాళ్ళు వెళ్లాక ఒక్కొక్కరు లోనికి వెళ్తుంటే ఆ గర్జన వినిపిస్తోంది.

కొండలరావులో సహనం చచ్చి, ధైర్యం వచ్చింది. అది మొండిధైర్యమే. అంతలో అతని ప్రక్కన కూర్చున్నవాడు బంట్రోతు భూషణంతో—

''అయ్యగారు ఈ వేళ కోపంగా వున్నట్టున్నారు?'' అనగానే-

''పెద్దపులి! ఈ వేళే కాదు, ఎప్పుడూ అంతే" అంటుండగానే బెల్ మోగింది.లోనికి వెళ్ళాడు.ఆ ప్రక్కవాడు కొండలరావు చెవిలో మెల్లగా ''అధికారి పెద్దపులి. ఈ బంట్రోతు ఆ పులి వెనుక బుట్టండి."

చివరకు కొండలరావు బారీ వచ్చింది. అధికారి యెదురుగా నిల్చోగానే తనవేపు చూడకుండా ఫైళ్ళమీద దృష్టితో ఉన్నాడు.

''చెప్పవయ్యా, నీ గొడవేంటో ?''

కొండలరావు మాటాడలేదు

''ఊఁ....చెప్పు .. మాటాడవేం?''

''మీ దృష్టి ఫైలు మీద వుందని.''

ఫైలు చప్పున మూసివేసి—

''చెప్పు. వేగం-నాకు టైములేదు. ఇంకో మీటింగుకు వెళ్ళాలి'' అరిచాడు.

''మీ తండ్రి వయసువాడిని.''

''అయితే?''

''మీ తండ్రే వస్తే యిలాగే మర్యాద చేస్తారా?''

''ఇంకేం మర్యాద కావాలి? నెత్తిన కూర్చోబెట్టుకోవాలా?''

''నెత్తిన యెందుకు? ఇక్కడ అరడజను కుర్చీలున్నాయ్. కనీసం ఒక కుర్చీ మీదైనా కూర్చునే అర్హత నాకు లేదా?''

''అమాయకుడిలా కనిపించావుగాని గట్టి కబుర్లే ఆడుతున్నావు.కూర్చో''

కొండలరావు కూర్చొని జేబులోనించి ఒక కాగితం తీసి అతని ముందు పెడ్తూ—

''ఈ కాగితంలో నా ఫైలు వివరాలు యిచ్చాను. చిన్న యిల్లు కట్టుకుందామని-'' అన్నాడు.

''నేనేం చేస్తాను? ఆ సెక్షనులో కనుక్కో.''

''పదిసార్లు ఆ సెక్షనులో తిరిగాను. విసిగిపోయాను. అర్చే తీర్చే అధికారి మీరని మీ యెదరకు వచ్చాను.''

''చూస్తాను. వెళ్ళు.''

''మళ్ళీ యెప్పుడు మీ దర్శనం చెయ్యమంటారు?''

''ఇదొక్కటేనా పని నాకు? చూస్తానన్నాను కదా!''

చప్పున కొండలరావుకు ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు జ్ఞప్తికి వచ్చాడు. ఈ బట్టలతో, యీ మాసిన గెడ్డంతో యితని యెదురుగా నిల్చోవటం వలన యీ అధికారి యింత ఉదాసీనత చూపిస్తున్నాడనుకుని, యిక తన తెలివితేటలు ఉపయోగించుకోవాలన్న ఊహ క్షణికంలో రాగానే వెనుతిరిగి-

''అయ్యా!మీరు వింటానంటే మీకో గొప్ప విషయం చెప్పి వెళ్ళిపోతాను'' అన్నాడు.

''ఏమిటా సోది- చెప్పు.''

''మీ ఆఫీసు యెదరగా-చూడండి. ఆ తొగరుచెట్టు. ఆ పువ్వులు చూస్తూ మురిసిపోకండి. నిజంగా అది ఒక బోధి వృక్షమండీ!''

''తొగరుచెట్టు బోధివృక్ష మెలా అవుతుంది?''

''జరిగింది వినండి. వరండాలో వేడి భరించలేక అక్కడ చల్లగా వుందని ఆ చెట్టు క్రింద కూర్చుంటే నాలో ఒక ప్రశ్న ఉదయించిందండీ!''

''ఏంటా ప్రశ్న?''

''పుట్టినప్పుడు స్వచ్ఛమైన జన్మ. మానవుడంటే మంచివాడని అర్థం కదా! మానవుడ్ని దానవుడిగా మార్చిందేమిటి?''

''ఈ ప్రశ్నకు తెలుసుకున్న సమాధానమేమిటి?''

''అయ్యా! ఆ చెట్టుకు ఎదరగా తమరు రోజుకు ఎనిమిది గంటలైనా వుండి ఆ గాలి పీలుస్తున్నారే! మీరు ఆ చెట్టునీడలో కాసేపు కూర్చుంటే మీకు నాలాగా గతించిన గొంతుకలు వినిపించి మీకేం సమాధానం చెప్తాయో?''

''కల గన్నావా?''

''వినండి. మళ్ళీ వస్తాను గదా. మీ మీటింగుకు ఆలస్యం చేసేశాను. క్షమించండి'' అంటూ కొండలరావు బయటకు వచ్చేశాడు.

మళ్ళీవారం. అదేరోజు వెళితే నరసింహం ఆఫీసులోనే వున్నాడు. కొండలరావును చూడగానే కుర్చీ చూపించి కూర్చోబెట్టాడు.

''అయ్యా! దొరికిందా?''

''మీ ఫైలా?''

''కాదు. ప్రశ్నకు సమాధానం దొరికిందా?''

''చెట్టు క్రింద కూర్చున్నాను. కానీ సమాధానం దొరకలేదు.''

''గౌతముడు బుద్ధుడు ఎలా కాగలిగాడంటారు?''

''సర్వం త్యజించాడు.''

"కాదు. దానివల్ల బుద్ధుడు కాలేదు. దానివలనే అయ్యుంటే ఆలా సర్వం త్యజించిన మానవులెందరో వున్నారు. వాళ్ళు బుద్ధుడంతటి వాళ్ళు అయిపోయేవారు."

"మరి దేనివలన?"

"గౌతముడు కరుణతో నిండి బోధివృక్షము క్రింద కూర్చున్నాడు. కాబట్టి బుద్ధుడు కాగలిగాడు."

"మీరే కరుణ నింపుకొని తొగరు చెట్టుక్రింద కూర్చున్నారు?"

"ఒక ముసలివాని చివరి కోర్కె. అద్దెయింట్లో చనిపోతే శవం ఎంత వేగిరం ఈడ్చివేస్తారని తొందర చేస్తారు. ఆసుపత్రిలో చనిపోతే శవం ఇంటికి తేనివ్వరు. అందుకే స్వంత యింట్లో చనిపోవాలని కోరుకున్నాడు. బతికినప్పుడు పదుగురిచేత బేష్ అనిపించుకున్నవాడు శవం అయ్యాక ఛీఛీ అనిపించుకోవటం

ఇష్టంలేక ఈ చిన్ని కోర్కె. కూతుళ్ళ పెళ్ళికి అమ్మగా చిన్న జాగా దీనికోసమే వుంచుకున్నాడు. గౌరవంగా చచ్చిపోవాలన్న యీ ముసలివాని చిన్నకోర్కెతో నా మనసు కరుణతో నిండిపోయింది. అతను నా తండ్రి అని కాదు - తోటి మానవుడన్న కరుణ - ఆ కరుణ నిండిన మనసుకు యీ తొగరు చెట్టు బోధివృక్షమైంది."

"ఈ మాత్రం దానికి....యెలా కట్టినా అయిపోయేదిగా...."

"గౌరవంగా చచ్చిపోతానన్నవాని ఘనత పెంచాలంటే నేను కట్టే యిల్లు నీతికి నిలయంగా వుండాలి. అందుకే మీ ఆఫీసు వెంట ఇన్నిసార్లు చేతులు కట్టుకుని తిరిగాను. మీ యెదరగా నిల్చున్నాను."

"మీరేదో గతించిన గొంతుక విన్నానన్నారు?"

"అదా! ఆ రోజు ఆలోచిస్తూనే చిన్న కునుకు తీసాను. నన్ను చంపుతున్నారర్రో అన్న కేకలు వినిపించాయి. చప్పున లేచిపోయాను. అన్యాయాన్ని అరికట్టమని సత్య ప్రపంచాన్ని అర్థించే ఆర్తనాదం అది. దానవుడినించి రక్షించమని మానవుడు చేసిన చివరికేక. నిజానికది నా చిన్ననాటి దృశ్యం. బహుశః నా రెండు గొంతుకల్లో, ఒక గొంతుకలో దాగిన యీ కేక యిన్నాళ్ళకు వినిపించగానే.... నాలో కరుణ పొంగింది."

"మనిషికి రెండు నాల్కలని విన్నాం - మీరు రెండు గొంతుకలుంటాయంటున్నారు!"

"మీ ఒక గొంతుకను కేవలం మీరే వినగలుగుతారు. రెండో గొంతుకతో అందరికీ వినిపించగలరు. మీరే వినగలిగిన మీ గొంతుక నిజానికి మీ గత తరాల గొంతుకలు వదిలిన విజ్ఞాన పీచికలు."

"మీ కల వివరంగా చెప్తారా?"

"నేను యే చెట్టు క్రింద కూర్చున్నానో - ఈ చెట్టు - చుట్టూ పరిసరాలు, యీ ఆఫీసు, ఉద్యానవనం నా చిన్నతనంలో ఒక చెరువుగా వుండేది. పశువులను కడిగేవారు. మనుషులు స్నానాలు చేసేవారు. చుట్టూ మర్రి మానులుండేవి. ఒక రోజు యెవరో యీ లోతు చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని విని పరుగెత్తాం. ఒక యువకుని శవం తేలుతోంది. తరవాత మా నాన్నగారి వలన తెలిసింది - అది ఆత్మహత్య కాదని. తన తాతల కాలం నించీ పొలం దున్ని, అనుభవిస్తున్న పీడు ఆ పొలం వదలడానికి ఒప్పుకోలేదట. ఎంచేతంటే, వాడికి యిది తప్పించి యింకో బ్రతుకు తెరువు లేదట. ఇంకో బ్రతుకు తెరువైనా చూపించండి, యీ పొలమైనా వుంచండి అని ఆ భూకామందుకు బ్రతిమాలాడట.

తన న్యాయం కోసం తను పోరాడిన ఆ మానవుడ్ని, డబ్బు దర్పంతో దానవుడైన భూకామందు ఆ ప్రాణాన్ని అలా బలిగొన్నాడు. ఆ నిరపరాధి కేకలే నేను విన్నాను. అప్పుడు నా ప్రశ్నకు సమాధానం దొరికింది. ఆ ప్రశ్న - మానవుడ్ని దానవునిగా మార్చిందేమిటి? మానవుడు యింకో మానవుడ్ని చంపలేడు. దానవునిగా మారిన మానవుడే ఆ ఘోరానికి పాల్పడగలడు. ఈ దానవ సంహారానికి అవతార పురుషులు వుదయిస్తారని మన పురాణాలు ఘోషిస్తున్నాయి కదా! ఈ రోజుల్లో అవతార పురుషులు యెవరు? ఆ నారాయణాంశ వున్న అధికారే అవతార పురుషుడు కాగలడు. వాడే అవినీతి రూపంలో వున్న దానవుడ్ని నీతి ఆయుధంతో సంహరించగలడు. ఆ సమాధానం తట్టగానే, మీలో ఆ నారాయణాంశ వుందని ఆవేళ అలా అంత ధైర్యంగా మాటాడగలిగాను. శలవిప్పించండి" అంటూ కొండలరావు బయటకు వచ్చేశాడు.

రెండు వారాల తరవాత ఒక రిజిష్టర్డు వుత్తరం వచ్చింది. కొండలరావు విప్పాడు. ఇల్లు కట్టుకోడానికి యిచ్చిన అనుమతి పత్రం. ఇప్పుడు అతనికి దీని అవసరం లేకపోయింది. ఎంచేతంటే. తన తండ్రి గతించి ఆనాటికి నాలుగో రోజు!

*

(1991)